వారపు సంత.. సమస్యల చింత

వారపు సంత.. పేద, దిగువ మధ్యతరగతి వారి షాపింగ్ ఆనందాన్ని తీర్చేది. ఉత్పత్తిదారుల తోపాటు, చిరు వ్యాపారులకు ఆసరానిచ్చేది. అలాంటి పరవాడ వారపు సంతను సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఏళ్ల తరబడి ప్రతి మంగళవారం జరిగే సంతలో వర్తకులకు శాశ్వత షెడ్‌లు, కనీస వసతుల్లేని దుస్థితి. ఆశీలు ముక్కుపిండి వసూలు చేయడంలో చూపే శ్రద్ధ.. సౌకర్యాల విషయంలో చూపట్లేదని వర్తకులు, కొనుగోలుదారులు ఆక్షేపిస్తున్నారు.

- పరవాడ సంతలో వర్తకుల ఇబ్బందులు
- ఏటా రూ.లక్షల ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా
- ఇరుగ్గా సంత స్థలం.. రోడ్ల మీదే వ్యాపారం
- ట్రాఫిక్ ఇక్కట్లతో వాహనదారులకు నరకం



షెడ్ల సదుపాయం లేకపోవడంతో టార్పాలిన్లు, షామియానాల నీడన కూరగాయల వర్తకులు

పరవాడ: అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన వస్తు సామగ్రి లభ్యమయ్యే పరవాడ వారపు సంతను సమస్యలు వేధిస్తున్నాయి. సంతకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా కనీస వసతుల కల్పనకు పంచాయతీ అధికారులు చొరవ చూపట్లేదు. వారం వారం సంత ద్వారా ఎంతో కొంత ఉపాధి పొందేందుకు అనకాపల్లి, గాజువాక, విశాఖ ప్రాంతాలకు చెందిన చిరు వ్యాపారుల నుంచి ముక్కు పిండి ఆశీళ్లు వసూలు చేయడం తప్ప, వసతుల కల్పనలో మాత్రం అధికార యంత్రాంగం దృష్టి సారించట్లేదు. దీంతో చాలా మంది వర్తకులు రోడ్ల పక్కన చిన్న టార్పాలిన్లు వేసుకుని, వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోంది.



కమ్మల పందిరిలో చేపల వ్యాపారం

పశువుల పట్ల దయలేదా?

సంతలో రైతులకు సంబంధించి అన్ని వ్యవసాయ పనిముట్లు దొరుకుతాయి. పశువుల క్రయ విక్రయాలు సాగించేందుకు తుని, పాయకరావుపేట, యలమంచిలి, కశింకోట, అచ్యుతాపురం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వస్తారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చే పశువులకు దప్పిక తీర్చేందుకు అవసరమైన నీళ్ల కుండీలు, గోలేలు, కుళాయిలు వంటి సదుపాయాల్లేవు. గతంలో షెడ్ల నిర్మాణం కోసం చెట్లను తొలగించడంతో ఉన్న కాస్త నీడ కూడా లేకుండా పోయింది.

ఐదేళ్లలో వచ్చిన ఆదాయం

సంవత్సరం	దుకాణాల ఆశీలు	కబేళా ఆశీలు
2020-21	రూ.1.96 లక్షలు	రూ.10,500
2021-22	రూ.2.51 లక్షలు	రూ.13,200
2022-23	రూ.2.52 లక్షలు	రూ.14,600
2023-24	రూ.2.65 లక్షలు	రూ.15,900
2024-25	రూ.2.76 లక్షలు	రూ.16,600



నిలువ నీడలేని పశువుల సంత

ఆశీలు తప్పనిసరి

సంతలో ఎక్కువగా విశాఖ, గాజువాక నుంచి నాటు కోళ్లను కొనుగోలు చేసి, తీసుకెళ్తారు. గ్రామీణ ప్రాంతాల్లో పండించే వ్యవసాయ ఉత్పత్తులకు సంతలో గిరాకీ ఎక్కువ. గొర్రె, మేక మాంసం, ఎండు, పచ్చి చేపల వ్యాపారం అధికంగా సాగుతుంది. వీరికి కూడ నిలువ నీడ లేక ఎండైనా, వానైనా తాటాకు పందిళ్లు, టార్పాలిన్లే దిక్కు. అయినప్పటికీ ఒక్కో దుకాణానికి రూ.50 చొప్పున ఆశీలు తప్పనిసరి. లారస్ పరిశ్రమ సౌజన్యంతో ఏర్పాటు చేసిన షెడ్లతో కొంత మందికే లబ్ధి చేకూరింది. అందరికీ షెడ్లు నిర్మించాలని వర్తకులు కోరుతున్నారు.

రోడ్ల పైనే వ్యాపారాలు

ప్రతి మంగళవారం జరిగే వారపు సంతపైనే సమీప పంచాయతీలకు చెందిన వివిధ వర్గాల ప్రజలు ఆధారపడుతున్నారు. సంత స్థలం ఇరుకుగా ఉండడంతో వర్తకులు తమ వ్యాపార లావాదేవీలను రోడ్ల మీదే జరుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సంతకు వచ్చే కొనుగోలుదారుల ద్విచక్ర వాహనాలు రోడ్లపై నిలపడం, చిరు వ్యాపారులు రోడ్లను ఆశ్రయించడంతో తరచూ బస్సుల రాకపోకలకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.



వాహనాలు నిలపడంతో బస్సుల రాకపోకలకు అవస్థలు

ఎండా, వానల్లో అవస్థలు



నేను సంతలో పచ్చి చేపల్ని అమ్ముతుంటాను. ఓ కమ్మల పందిరి కిందే వ్యాపారం చేసుకుంటున్నా. వానొస్తే పందిరి మొత్తం కారిపోతుంది. పక్కా షెడ్డు లేక ఎండావానల్లో ఇబ్బంది పడుతూనే వ్యాపారం చేసుకుంటున్నాను. పందిరికి రూ.50 ఆశీలు చెల్లిస్తున్నాను. కొనేవారికి ఎలాంటి సౌకర్యాల్లేవు. కనీసం మాకైనా నిలువ నీడ పక్కాగా ఉంటే బాగుండు. – మసేనమ్మ, చేపల వ్యాపారి, ముత్యాలమ్మపాలెం

టార్పాలిన్లే దిక్కు



పరవాడ సంతలో ఏళ్ల తరబడి కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. నాకు, నాతో పాటు చాలా మంది వర్తకులు పక్కా షెడ్లు లేక కర్రలకు టార్పాలిన్లు కట్టి, దాని కింద కూరగాయలను అమ్ముతున్నాం. ఆశీలు యథావిధిగా వసూలు చేస్తున్నారు. షెడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు. వర్షం వస్తే టార్పాలిన్లు కారిపోతున్నాయి. వ్యాపారం మూసుకోవాల్సి వస్తోంది. – పైల అప్పారావు, కూరగాయల వ్యాపారి, పరవాడ

సౌకర్యాలు కల్పించాలి



ప్రతి వారం పశువుల వ్యాపారం నిమిత్తం ఈ సంతకు వస్తాను. పశువుల సంతలో నిలువ నీడ లేక మండుటెండలో గంటల తరబడి గడపాల్సి వస్తోంది. పశువుల దప్పిక తీర్చడానికి మంచినీటి గోలేలు లేక చెరువుపై ఆధారపడుతున్నాం. మంచినీటి కుళాయి లేకపోవడంతో తాగునీటికి పాన్ షాపులే దిక్కవుతున్నాయి. సంతలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. – నీల దేముడు, రైతు, తానాం

చర్యలు తీసుకుంటాం..



పశువుల సంతలో గోలేలను ఏర్పాటు చేసి, జీవాల తాగునీటి సమస్య తొలగిస్తాం. నీడ కోసం చెట్ల పెంపకంపై చర్యలు తీసుకుంటాం. సంతలో ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు చర్యలు తీసుకోవాలి. రోడ్లపై వ్యాపారాలను సాగించే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు నివేదించాం. సంతలో అదనపు షెడ్ల నిర్మాణాలపై పాలకవర్గం నిర్ణయం తీసుకుంటుంది. – అచ్యుతరావు, పంచాయతీ కార్యదర్శి, పరవాడ

చవితి ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలను అనుమతించం

సీఐ పిన్నంటి రమణ



సాక్షి ఎఫెక్ట్..

సబ్బవరం: వినాయక చవితి ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు, అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ పిన్నంటి రమణ హెచ్చరించారు. మండలంలోని తవ్వవానిపాలెంలో శనివారం రాత్రి గణపతి నిమజ్జనోత్సవంలో రికార్డింగ్ డ్యాన్స్‌లపై సాక్షిలో 'వినాయకుడి ఊరేగింపులో అర్ధనగ్న ప్రదర్శనలు'శీర్షికన వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో స్వామివారి అనుపు మహోత్సవం సమాచారం ఉందని, సిబ్బందిని పంపినప్పటికీ వారికి తెలియకుండా డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ప్రోగ్రాంని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ప్రోగ్రాం ఏర్పాటుచేసిన నిర్వాహకులు, ప్రోగ్రాం అర్గనైజ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లకు అనుమతి లేదన్నారు. మండలంలో ఎక్కడైనా ఇటువంటివి నిర్వహిస్తే నిర్వాహకులతోపాటు, పాల్గొన్నవారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అంతే భక్తిభావంతో ముగించాలని హితవుపలికారు.

పద్ధతి మార్చుకోండి..

రౌడీ షీటర్లకు సీఐ సతీష్‌కుమార్ హితవు



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: సమాజంలో మీకు, మీ కుటుంబాలకు కనీస గుర్తింపు ఉండాలంటే నేర ప్రవృత్తి నుంచి బయటపడాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ సూచించారు. రౌడీషీటర్లు పద్ధతి మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. పెందుర్తి సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడనాడితే భవిష్యత్ బాగుంటుందన్నారు. పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఎస్‌ఐ ఆసిరితాత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దేవస్థానం ఉద్యోగికి చెక్కు అందిస్తున్న దాతలు సూర్యనారాయణ, సుబ్బలక్ష్మి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి లేఅవుట్‌కి చెందిన ఎ.వి.సూర్యనారాయణ, ఎ.సుబ్బలక్ష్మి రూ.లక్ష 116 విరాళాన్ని ఆదివారం అందించారు. సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ సంబంధిత విరాళానికి చెక్కు రూపంలో ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు వెంకటేశ్వరరావు, మంథా సుబ్బారావు, అప్పలరాజు పాల్గొన్నారు.

శిథిల తుపాను భవనం కూల్చివేత



స్వయంభూవరంలో శిథిలమైన తుఫాన్ షెల్టర్‌ను తొలగించిన దృశ్యం

పరవాడ: కలపాక శివారు స్వయంభూవరంలో చాలా ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన తుపాను భవనాన్ని ఇంజినీరింగ్ అధికారుల అనుమతితో స్థానిక సర్పంచ్ బొండా కనకరావు ఆదివారం తొలగించారు. శిథిలాలను అక్కడి నుంచి పూర్తిగా తొలగించిన అనంతరం, ఆ స్థలాన్ని ప్రజోపయోగ కార్యక్రమానికి వినియోగిస్తామన్నారు. శిథిలావస్థకు చేరి, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనకు కారణమైన తుఫాన్ షెల్టర్‌ను తొలగించేందుకు కృషి చేసిన సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.

రామకృష్ణకీర్తికి ఉగాది పురస్కారం



డాక్టర్ రామకృష్ణకీర్తిని సత్కరిస్తున్న దృశ్యం

పరవాడ: సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందించిన పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్(పరవాడ) డాక్టర్ రామకృష్ణకీర్తికి ఉగాది పురస్కారం లభించింది. తిరుపతి సిటీ చాంబర్స్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సాంస్కృతిక, సామాజిక సేవా పురస్కార కార్యక్రమంలో వైద్య రంగం, సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందించిన ఆయనకు తిరుపతి ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఘనంగా సత్కరించి, పురస్కారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరోనా సమయంలో రామకృష్ణకీర్తి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పోకల ఆశోక్‌కుమార్, ఆయూబ్‌ఖాన్, డా.కరుణానిధి, పలువురు ప్రొఫెసర్లు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారమ్మ విజయమ్మ

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈవో సురేష్‌బాబా భక్తుల సౌకర్యాలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా మౌలిక వసతులు కల్పించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పనులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

పచ్చదనం.. ఆహ్లాదకరం



పరవాడ-లంకెలపాలెం రహదారిలో రాంకీ వద్ద రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లు



ఎన్టీపీసీ పరిపాలన భవనం వద్ద నీడనిస్తూ ఏపుగా ఎదిగిన చెట్లు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ, రాంకీ యాజమాన్యాలు మండలంలో పలు చోట్ల రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పరవాడ-వాడచీపురుపల్లి రహదారిలో ఎన్టీపీసీ అడ్మిన్ భవనానికి సమీపంలో, పరవాడ-లంకెలపాలెం రహదారిలో రాంకీ కార్యాలయం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా కొన్నేళ్ల క్రితం చెట్లను నాటారు. అవి ప్రస్తుతం నడి నెత్తిన సూరీడున్నా.. ఎండ సెగ తగలనంతగా ఇరువైపులా ఏపుగా ఎదిగాయి. ఈ దారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు చల్లదనంతోపాటు, ఆహ్లాదకర వాతావరణాన్ని ఆనందిస్తున్నారు.

ముగిసిన బాలుర మండల స్థాయి క్రీడా పోటీలు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి బాలుర క్రీడా ఎంపిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో వాలీబాల్ క్రీడలో సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఖోఖోలో సబ్బవరం సన్‌రిడ్జ్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, నంగినారపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో, కబడ్డీ పోటీల్లో మల్లునాయుడుపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రథమ, ఆరిపాక జెడ్పీ హైస్కూల్ ద్వితీయ, బ్యాడ్మింటన్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన రెండు జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. చెస్ పోటీల్లో సబ్బవరం గురుకుల విద్యార్థులు విన్నర్స్‌గా, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. యోగాలో విన్నర్స్, రన్నర్స్‌గా ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు ఆరిపాక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నాగమల్లేశ్వరరావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ మళ్ల యోగి చేతుల మీదుగా బహుమతులు అందించారు. విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సోమవారం బాలికల క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పీడీలు అబ్దుల్ రెహ్మాన్, చందన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో ఉత్సాహంగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కేబీఆర్ జంక్షన్ వద్ద స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ధర్నా చేశారు. పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని ప్రభుత్వం, యాజమాన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చర్యలతో ప్లాంట్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుందన్నారు. ప్లాంట్‌ను రక్షిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజల నమ్మకం కోల్పోకముందే నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ, కూటమి ఎంపీలపై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆధారపడి ఉందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ఉక్కు మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మలు ప్లాంట్‌ను రక్షిస్తామని హామీ ఇచ్చి వెళ్లారని.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగేలా, పూర్తి ఉత్పత్తి చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్, మాజీ కార్పొరేటర్ కె. విమల మాట్లాడుతూ కార్మికుల జీతాల్లో కోత విధిస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు.

టీడీపీలో చేరికలు

పెందుర్తి: మండలంలోని చింతగట్లకు చెందిన రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు సహా పలువురు టీడీపీలో చేరారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు, పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ సమక్షంలో వీరు ఆ పార్టీ కండువాలు వేసుకున్నారు.

మర్యాదపూర్వక కలయిక



అశోక్‌గజపతిరాజుకు ప్రసాదం అందిస్తున్న సింహాచలం ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన వి.త్రినాథరావు దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుని విజయనగరం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఈవో వెంట దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో రమణమూర్తి, డీఈ హరి తదితరులు ఉన్నారు.

- మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుని సింహాచలం దేవస్థానం నూతన ఈవో వి.త్రినాథరావు ఆదివారం మర్యాదపూరకంగా కలిశారు. ఆయనకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందించారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, దేవస్థానం అధికారులు, వైదికులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధనలు



గణపతిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, స్థానిక నాయకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. తొలుత ఆయన గణనాథుడిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన స్థానిక నాయకులు, యువతతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల ఉపాధ్యక్షుడు బందం నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు, నాయకులు వెన్నల సన్యాసిరావు, కూండ్రపు సీతారామయ్య, స్పీడు మసేను, చిన మసేను, గొర్లి గోపి, పల్లా గోవిందు, పైల సన్యాసినాయుడు, ఈరుగుల లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పురుషోత్తపురంలో ఆదివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించగా దాదాపు 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. గణేష్ యూత్ ప్రతినిధులు చీర అప్పలరాజు, పినిశెట్టి జగన్నాథం, సత్యనారాయణ, సూర్యనారాయణ, జొన్నాడ త్రినాథ్, దొరబాబు, బాలాజీ, రాము, చీర కన్నారావు, అప్పలరాజు, రాజారావు, మల్లికార్జున, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



గణపతిని దర్శించుకుంటున్న గండి బాబ్జీ, కమిటీ ప్రతినిధులు

రసాభాసగా ఆలయ కమిటీ సమావేశం



రోడ్డుపై గొడవపడుతున్న కొందరు సభ్యులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడాలేఅవుట్ వరసిద్ధి వినాయక ఆలయంపై ఎండో మెంట్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించింది. సమావేశంలో ప్రతేకంగా ఎండోమెంట్, విజిలెన్స్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. ఆలయాన్ని కాపాడుకునేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలన్న అంశాలను గాలికి వదిలేసి.. ఫిర్యాదు దారుడిపై ఏ చర్యలు తీసుకోవాలన్న అంశాలపై పలువురు సభ్యులు మాట్లాడడంతో వివాదం రేగింది. మరి కొందరు సభ్యులు వివాదాన్ని సద్దుమణిగేలా కమిటీ సభ్యులు ప్రయత్నించాలని.. అందుకు తామంతా సహకరిస్తామని తెలిపారు. సమావేశం అయిన తర్వాత కొందరు సభ్యులు రోడ్డుపైకి వచ్చి గొడవ పడ్డారు. ఇది మాటామాటా పెరిగి తోపులాట వరకు వచ్చింది. కాలనీ వాసులే కలుగజేసుకుని సద్దుమణిగేలా చేశారు. అసలు ఫిర్యాదు దారుడే సమావేశానికి హాజరు కాలేదని చెప్పుకుంటూ సభ్యులంతా వెళ్లిపోయారు.